రహదారుల దిగ్బంధం



అరకులోయ నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద రాస్తారోకో చేస్తున్న ప్రజా సంఘ నాయకులు

- మణిపూర్ ఘటనను నిరసిస్తూ మన్యం బంద్
- స్వచ్ఛందంగా దుకాణాల మూసివేత
- నిలిచిన ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ సర్వీసులు
- మద్దతు తెలిపిన వివిధ పార్టీల నేతలు


అనంతగిరిలో బంద్ చేపడుతున్న గిరిజనులు


దుంబ్రిగుడలో రాస్తారోకో నిర్వహిస్తున్న గిరిజన సంఘం, వైఎస్సార్‌సీపీ నాయకులు


ముంచంగిపుట్టులో మానవహారంగా ఏర్పడిన నేతలు, గిరిజనులు


పెదబయలులో నిరసన తెలుపుతున్న నాయకులు

అరకులోయ టౌన్: మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై జరిగిన అఘాయిత్యాలను నిరసిస్తూ అల్లూరి జిల్లాలో గురువారం ప్రజా సంఘాలు, గిరిజన సంఘాలు చేపట్టిన బంద్ పాక్షికంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో వ్యాపారస్తులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసి వేశారు. పెట్రోల్ బంక్‌లు, పర్యాటక ప్రాంతాలు మూతబడ్డాయి. పాఠశాలలను మూసివేశారు. హోటళ్ళు మూతపడ్డాయి. ఉదయం నుంచే గిరిజన సంఘం నేతలు రోడ్లన్నీ దిగ్బంధం చేశారు. ఆర్టీసీ బస్సులు పూర్తిగా నిలిపివేయడంతో రవాణా వ్యవస్థ స్తంభించింది. ప్రయివేటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర సేవలు అంబులెన్స్‌లను మాత్రమే విడిచిపెట్టారు. భారీ ర్యాలీలు, ప్రధాన కూడళ్లలో మానవహారం నిర్వహించారు.బంద్‌కు వివిధ రాజకీయ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాలు, గిరిజన సంఘాల ప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు మాట్లాడుతూ మణిపూర్‌లో శాంతిభద్రతలను నెలకొల్పే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై జరిగిన ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం గిరిజన చట్టాలు, హక్కులకు రక్షణ కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. మణిపూర్‌లో శాంతి వాతావరణం నెలకొల్పేలా కేంద్రం చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందుస్తుగా బందోబస్తు నిర్వహించారు.

● అరకులోయలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల వద్ద రాస్తారోకో నిర్వహించారు. అనంతరం అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ బంద్‌లో పాల్గొని మద్దతు ప్రకటించారు. గిరిజన సంఘం, వివిద సంఘాల నాయకులు బాలదేవ్, రామారావు, శాంతికుమారి, వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అనంతగిరి/దుంబ్రిగుడ/హుకుంపేట/ముంచంగిపుట్టు/పెదబయలు/కొయ్యూరు/చింతపల్లి రూరల్: అనంతగిరి, చిలకలగెడ్డ లో గిరిజనులు, విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. ఏజెన్సీ పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు బంద్‌కు మద్దతునిచ్చారు. పాస్టర్లు పీటర్, నీలయ్య, జోషఫ్, నాగులు తదితరులు పాల్గొన్నారు. దుంబ్రిగుడలో గిరిజన సంఘం, వైఎస్సార్‌సీపీ నేతలు శెట్టి గోపాల్, సురేష్, గుర్మీసింగ్ తదితరులు పాల్గొన్నారు. హుకుంపేటలో గిరిజన సంఘం, సీపీఎం, సీపీఐ నేతలు, కృష్ణారావు, హైమావతి, వైస్ ఎంపీపీ కొండలరావు, కృష్ణారావు, సర్పంచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. ముంచంగిపుట్టులో వైస్ ఎంపీపీ సత్యనారాయణ, పాస్టర్లు మోహన్, ప్రసాద్, బర్నిబాస్, నేతలు శ్రీను, మల్లికార్జున్, జయదేవ్, జగబందు తదితరులు పాల్గొన్నారు. పెదబయలులో సర్పంచ్ రవిశంకర్, నాయకులు సన్నిబాబు, శరభన్న, కొండబాబు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు. కొయ్యూరులో సర్పంచ్ బాలరాజు, నేతలు సూరిబాబు, కనకరాజు, చక్రరావు, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు. చింతపల్లిలో నేతలు సుబ్బారావు, కొండలరావు, జ్ఞానేశ్వరి, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల/జీకే వీధి : జి.మాడుగుల మండలం మద్దిగరువు, గూడెం కొత్తవీధి మండల కేంద్రాల్లో వారపుసంత రద్దయ్యాయి. సర్పంచ్‌లు రాంబాబు, మాలన్న, ఎంపీటీసీ సభ్యులు సన్యాసిదొర, ఈశ్వరరావు, నేతలు దీనబంధు, మహేష్, కోటేశ్వరరావు, లక్ష్మణ్, పండుబాబు, రాము, బ్రహ్మలింగం తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల/రాజవొమ్మంగి/మారేడుమిల్లి/చింతూరు: రంపచోడవరం నియోజకవర్గంలోని అడ్డతీగలలో జరిగిన బంద్‌లో ఆదివాసీ సంఘం నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. రాజవొమ్మంగిలో సర్పంచ్‌లు శుభలక్ష్మి, గణలక్ష్మి, సత్యవతి, చంద్రుడు, జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి, నాయకులు సూరిబాబు, జగన్నాథం, నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అడిషనల్ ఎస్‌ఐ జాన్‌కుమార్ నేతృత్వంలో స్థానిక పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. మారేడుమిల్లిలో గిరిజన సంఘం, సీఐటీయూ నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు. చింతూరులో గిరిజన సంఘం, ఐద్వా సంఘం నేతలు సురేష్, రంగమ్మ, సుబ్బమ్మ, శ్రీనివాస్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


మద్దిగరువు వారపు సంతను రద్దు చేసి బంద్ నిర్వహిస్తున్న నాయకులు, గిరిజనులు


జీకే వీధిలో రాస్తారోకో చేస్తున్న నేతలు


లంబసింగి జంక్షన్ వద్ద రోడ్డుపై బైఠాయించిన నాయకులు



కొయ్యూరులో ఆందోళన చేస్తున్న వివిధ పార్టీల నేతలు


అడ్డతీగలలో నినాదాలు చేస్తున్న ఆదివాసీ సంఘ నేతలు, విద్యార్థులు


రాజవొమ్మంగిలో రాస్తారోకో


మారేడుమిల్లిలో మానవహారంలో వివిధ సంఘాల నేతలు


చింతూరులో నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

క్లుప్తంగా

వరద బాధితులకు తక్షణ సాయం

ఎటపాక: గోదావరి వరద ముంపు బాధితులకు ప్రభుత్వం తక్షణ సాయం అందజేసింది. ప్రతి కుటుంబానికి రూ.2వేల ఆర్థిక సాయం పంపిణీ చేశారు. మండలంలో 13 పునరావాస కేంద్రాల్లోని 2021 మంది కుటుంబాలకు రూ.40.42లక్షలు ప్రభుత్వం తక్షణ సాయంగా అందించిందని, వాటిని బాధితులకు వెంటనే అందించేందుకు ఏర్పాట్లు చేసినట్టు తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం


ఆహారాన్ని రుచిచూస్తున్న ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు

దుంబ్రిగుడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మెను సక్రమంగా అమలు చేయాలని లేని పక్షంలో చర్యలు తప్పవని ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు అన్నారు. ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనంలో మెనూ పరిశీలించి, ఆహారాన్ని రుచి చూశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందజేయాలని సూచించారు. హెచ్‌ఎం వెంకటరావు, ఉపాధ్యాయులున్నారు.

ముంపు బాధితులకు పరామర్శ


బాధితులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఎటపాక/ చింతూరు: ఎటపాక మండలంలోని గోదావరి వరద ముంపు ప్రాంతాలైన నెల్లిపాక, వీరాయిగూడెం గ్రామాలతో పాటు చింతూరులో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు గురువారం పర్యటించారు. బాధితుల సమస్యలను తెలిసుకున్నారు. నిర్వాసితుల తరపున పోరాడి వారికి అండగా ఉంటామన్నారు. నేతలు సీతారాం, కిరణ్, నాగేశ్వరరావు, పద్మ, శ్రీను, రంగమ్మ పాల్గొన్నారు.

రెయిన్‌కోట్లు పంపిణీ


గిరిజన మహిళలకు రెయిన్‌కోట్లను అందజేస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి

అనంతగిరి: మండలంలోని గుమ్మ పంచాయతీ చెరుకుబిడ్డ గ్రామంలో ఎంపీపీ శెట్టి నీలవేణి గురువారం పర్యటించారు. పొలాల్లో వరినాట్లు వేస్తున్న గిరిజన మహిళలతో మమేకమయ్యారు. గిరిజన మహిళలతో కలిసి వరినాట్లు వేశారు. చెరుకుబిడ్డ, కరివేసు గ్రామాలకు చెందిన సుమారు 100 మంది గిరిజన మహిళలకు రెయిన్‌కోట్లను పంపిణీ చేశారు. అనంతరం గుమ్మలోని జరిగిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలోని పాల్గొన్నారు. మాజీ పీఏసీఎస్ చైర్మన్ కృష్ణమూర్తి, శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి ఆజాదీ కా అమృత్ మహోత్సవాలు


మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: మండలంలోని ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు ఆజాద్‌కా అమృత మహోత్సవాలు నిర్వహించాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు సూచించారు. ఈ సందర్భంగా 16 పంచాయతీలకు చెందిన కార్యదర్శులతో, సచివాలయ సిబ్బందితో అత్యవసర సమావేశం నిర్వహించారు. ప్రజల్లో దేశభక్తిని ఉత్తేజపరచేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. దేశం కోసం పోరాడిన యోధులకు, వీరులకు శిలాఫలకాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

రాజయ్య సేవలు మరువలేనివి


రాజయ్య చిత్రపటం నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

చింతూరు: మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య చేసిన సేవలు మరువలేనివని సీపీఎం నాయకులు అన్నారు. రాజయ్య వర్ధంతి సందర్భంగా గురువారం చింతూరులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఏజన్సీలో గిరిజన సమస్యలపై రాజయ్య అలుపెరగని పోరాటాలు చేశారని గుర్తుచేశారు. నాయకులు శ్రీనివాసరావు, సీతారామయ్య, సురేష్, వెంకట్, రంగమ్మ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మాజీ ఎమ్మెల్యే, కామ్రేడ్ సున్నం రాజయ్య వర్ధంతి సందర్భంగా గురువారం ప్రజా సంఘాల నాయకులు ఆయనకు ఘన నివాళులర్పించారు.సూరిబాబు, బాలకృష్ణ, శ్రీను, అబ్బాయి, జగన్నాధం పాల్గొన్నారు.

గిరిజనుల ఆరోగ్యానికి ప్రాధాన్యం


గర్భిణులు, బాలింతలకు సూచనలిస్తున్న సర్పంచ్ శారద

దుంబ్రిగుడ: ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా అమలుచేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం కిట్‌లను గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని అరకు పంచాయతీ సర్పంచ్ శారద అన్నారు. నేరేడివలస అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ్ కిట్‌లను ఆమె గర్భిణులు, బాలింతలకు గురువారం అందజేశారు. ఆమె మాట్లాడుతూ గిరిజనుల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, పౌష్టికాహారాన్ని అందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గర్భిణులు తరచూ వైద్య పరీక్షలు చేసుకోవాలని, ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు. ఏఎన్‌ఎం దొయిమొత్తి, అంగన్‌వాడీ కార్యకర్త పవిత్ర, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి సెక్షన్ 11కేవీ, జడ్డంగి ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. ట్రీ కటింగ్ చేపడుతున్న నేపథ్యంలో చెరకుంపాలెం, బోర్నగూడెం, మర్రిపాలెం, వెలగలపాలెం, ఉర్లాకులపాడు, జి.శరభవరం కరెంట్ సరఫరా ఉండదన్నారు.

లోకోస్ యాప్‌పై అవగాహన

కశింకోట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు, రాయితీలు పొందేందుకు స్వయం సహాయక సంఘాల సభ్యుల తమ వివరాలను లోకోస్ యాప్‌లో నమోదు చేసుకోవాలని వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు కోరారు. కశింకోటలోని గోవిందరావు కాలనీలో గురువారం స్వయం సహాయక సంఘాల సభ్యులకు లోకోస్ యాప్‌పై అవగాహన కల్పించి, వారి వివరాల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యాప్‌లో వివరాలు నమోదు చేయడం వల్ల దేశంలోని స్వయం సహాయక సంఘాలన్నీ ఒకే గొడుగు కింద ఉంటాయన్నారు. ప్రభుత్వ పథకాలు, రాయితీలు అందరికి ఒకే విధానంలో అందుతాయన్నారు. ఆధార్, బ్యాంకు అక్కౌంట్లతో స్వయం సహాయక సంఘ మహిళలు తమ పేర్లను యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీసీ సత్యనారాయణ, వీవోఏ రాము తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష గిరిజనులకు వరం

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయటౌన్: జగనన్న సురక్ష గిరిజనులకు ఒక వరమని, పైసా ఖర్చు లేకుండా వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు తమ గ్రామ సచివాలయాల్లో ఉచితంగా పొందారని అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. నవరత్నాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా అందరికీ అందించాలనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో 86,499 కుటుంబాల్లో సర్వే నిర్వహించగా 64,608 ధ్రుపత్రాలకు దరఖాస్తులు అందగా వాటిలో 58,471 ధ్రువపత్రాలు అందజేసినట్టు ఎమ్మెల్యే తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత హుకుంపేట మండల కేంద్రంలో పరిష్కార్ అనే కార్యక్రమం నిర్వహించగా 154 దరఖాస్తులు రాగా వాటిలో అన్ని శాఖల సమన్వయంతో 100 దరఖాస్తులను ఒక్క రోజులోనే పరిష్కరించామన్నారు. అరకులోయ నియోజకవర్గం పరిధిలో టీడబ్ల్యూ పర్యవేక్షణలో 394, పీఏఓ ద్వారా 105, పీఆర్ ద్వారా 761 రోడ్లు వేయించామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా 3,752 కొళాయిలు వేయించినట్టు చెప్పారు. ఇప్పటి వరకు రూ.172.20 కోట్లతో 5,012 పనులు చేసినట్లు ఎమ్మెల్యే పాల్గుణ వివరించారు. వైఎస్సార్ క్రాంతి పథకం ద్వారా నియోజకవర్గం వ్యాప్తంగా 2,200 స్వయం సహాయక సంఘాల 23,533 మందికి రూ.7,48,68,000లను సున్నా వడ్డీతో అందజేసినట్టు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, ఎంపీటీసీ భీమరాజు, కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, మండల పార్టీ కన్వీనర్ పట్టాసి సంపత్, నాయకులు బాలరాజు, నర్సింగ్, గోపాలరావు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు


ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏవో శ్రీనివాసరావు

చింతూరు: మండలంలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు సరఫరా చేయనున్నట్టు మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తెలిపారు. ప్రస్తుత సీజన్‌కు సంబంధించి డీఏపీ 80 టన్నులు, యూరియా 311 టన్నులు, సూపర్ సల్ఫేట్ 134 టన్నులు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 7 టన్నులు రైతులకు అందించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం చింతూరు ఆర్బీకేలో 4.32 టన్నులు, ఏజీ కొడేరులో 12 టన్నుల యూరియా అందుబాటులో ఉందని,, రెండ్రోజుల్లో కుమ్మూరు, చిడుమూరు ఆర్బీకేల్లో 25 టన్నుల డీఏపీ అందుబాటులో ఉంచుతామన్నారు. ఎరువుల విషయంలో రైతులు ఆందోళన చెందొద్దని, అన్ని ఆర్బీకేలకు ఎరువులు సరఫరా చేసినట్టు ఏవో తెలిపారు.

మండలంలో వరిపైర్లు నారుమడి దశలో ఉన్నాయని, వర్షాలు కురిసే సూచన వుంటే ఎరువులు వేయవద్దని, పొడి వాతావరణంలో తేమగా ఉన్నప్పుడు మాత్రమే ఎరువులు చల్లాలని ఆయన సూచించారు. మండలంలోని తుమ్మల, కుమ్మూరు, ఏజీకొడేరు, చదలవాడ రైతుభరోసా కేంద్రాల్లో ట్రాక్టర్లు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగి కౌలు పట్టాలు కావాల్సిన రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులు, వీఆర్వోను కలిసి ధ్రువీకరణ పత్రాలు అందచేసి కౌలు పట్టాలని పొందాలని ఆయన సూచించారు. రైతుల ఫిర్యాదు మేరకు మంగళవారం అమ్మకాలు నిలిపివేసిన స్థానిక మన గ్రోమోర్ ఎరువుల దుకాణంలో బుధవారం వ్యవసాయశాఖ ద్వారా అమ్మకాలు నిర్వహించినట్లు ఏవో శ్రీనివాసరావు తెలిపారు. 59 డీఏపీ బస్తాలతో పాటు ఇతర ఎరువులను సిబ్బంది ద్వారా రైతులకు విక్రయించినట్టు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఎమ్మార్పీ కంటే ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

గ్రామాల్లో సీజనల్ అలెర్ట్

- వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- దోమల నిర్మూలనకు ఫాగింగ్ పనులు


ముంచంగిపుట్టులో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

ముంచంగిపుట్టు: వర్షాలు పడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాలతో గిరిజన పల్లెల్లో ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ చేపట్టారు. దోమల నిర్మూలనకు ఫాగింగ్ పనులు చేయిస్తున్నారు.జ ర్వపీడితులను గుర్తించేందుకు ఇంటింటా ఫీవర్ సర్వే సైతం నిర్వహిస్తున్నారు. గిరిజన ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు జనజీవనాన్ని స్తంభింపజేస్తున్నాయి. డ్రెయిన్లు పొంగి వీధుల్లో మురుగు నీరు ప్రవహిస్తున్నాయి. పారిశుద్ధ్యం లోపించి వ్యాధులు అధికంగా ప్రబలే అవకాశం ఉండడంతో పంచాయతీ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సంయుక్తంగా పారిశుధ్యంపై దృష్టిపెట్టారు .గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ, ప్రతి శుక్రవారం డ్రైడేను నిర్వహిస్తున్నారు.

వ్యాధుల కట్టడికి చర్యలు

జ్వరాల వ్యాప్తికి కారణమవుతున్న దోమల నిర్మూలన కోసం డ్రైనేజీలు, నీరు నిల్వ ఉండే ప్రదేశాలపై అధికారులు దృష్టి పెట్టి మలేరియా మందు స్ప్రేయింగ్ చేయిస్తున్నారు. లార్వాను అరికట్టేందుకు మురుగు కాలువల్లో ఆయిల్ బాల్స్ వేయిస్తున్నారు. ప్రతి రోజు ఇంటింటా చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు వీధుల్లో ఎక్కడ చెత్త కుప్పలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. తాగునీరు కలుషితం కాకుండా క్లోరినేషన్ చేయిస్తున్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా వలంటీర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. జ్వరపీడితులను గుర్తించి వారికి అవసరమైన వైద్య సేవలను ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా అందిస్తున్నారు. ఆరోగ్య జాగ్రత్తలపై గ్రామాల్లో గిరిజనులకు వైద్య సిబ్బంది, అధికారులు సూచిస్తున్నారు.

విస్తృతంగా పారిశుధ్య పనులు



గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేయిస్తున్నాం. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా గిరిజనులు వైద్యులు, సిబ్బంది, పంచాయతీ అధికారులు ఇస్తున్న సూచనాలు తప్పకుండా పాటించాలి. జ్వరాలు వస్తే ఆస్పత్రులకు వచ్చి వైద్యం పొందాలి. పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. దోమలు వ్యాప్తి చెందకుండా ఫ్రైడే డ్రైడేను సైతం నిర్వహిస్తున్నాం.

– ఆర్.వి.ఎస్.రమేష్, ఎంపీడీవో, ముంచంగిపుట్టు

నేడు లబ్బర్తిలో గడప గడపకు

రాజవొమ్మంగి: లబ్బర్తి పంచాయతీ పరిధిలోని నెల్లిమెట్ల, మొల్లిమెట్ల, సీతారాంపురం గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ తెలిపారు. రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి హాజరవుతున్నట్టు పేర్కొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

అనకాపల్లిటౌన్: ప్రశాంతమైన వాతావరణంలో గ్రామదేవతల మహోత్సవాలు నిర్వహించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గవరపాలెం సుంకరమెట్ట జంక్షన్ సత్తెమ్మతల్లి అమ్మవారి ఆలయ 32వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్‌లు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. మధ్యాహ్నభోజన కార్యక్రమాన్ని దాడి రత్నాకర్ ప్రారంభించారు. అంతకుముందు కమిటీ అధ్యక్షుడు బొడ్డేడ మోహనరావు మంత్రి గుడివాడ అమర్‌నాథ్, రత్నాకర్‌లను శాలువాలతో సత్కరించి, అమ్మవారి ఫొటోలను అందించారు. వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్, కమిటీ కార్యదర్శి విల్లూరి త్రినాథ్, కోశాధికారి దాడి వెంకునాయుడు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక కస్పావీధి పొలాల్లో వెలసిన సత్తెమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, భక్తులు, రైతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బుల్లిబాబు మాట్లాడుతూ నూతనంగా నిర్మించనున్న అమ్మ వారి ఆలయానికి తన వంతు సాయంగా, అవసరమైన మేరకు సిమెంట్ బస్తాలు అందిస్తానని ప్రకటించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.